# న్యూస్‌క్లిక్‌పై దాడులను ఖండిస్తున్నాం

**'న్యూస్‌క్లిక్'** ప్రధాన సంపాదకులు ప్రబీర్ పురకాయస్థను, ఆ సంస్థ హెచ్‌ఆర్ అధికారి అమిత్ చక్రవర్తిని 'ఉపా' చట్టం క్రింద ఢిల్లీ పోలీసులు చట్టవిరుద్ధంగా అరెస్టు చేయటాన్ని సిపిఐ (ఎం-ఎల్) తీవ్రంగా ఖండిస్తోంది. అలాగే 'న్యూస్‌క్లిక్'కు అనుబంధంగా పనిచేస్తున్న వారిపై దాడులు చేయటాన్ని కూడా ఖండిస్తోంది.

న్యూస్‌క్లిక్ మరియు ఇతర సంస్థలు 'భారత వ్యతిరేక ముఠా'గా 'ముక్కల ముక్కల ముఠా'గా ఆగస్టు 7వ తేదీన బిజెపి ఎం.పి. నిశాంత్ దుబే ఆరోపణలు చేశాడు. ఇంకా వీరు చైనా నుండి నిధులు అందుకున్నట్లుగా 'న్యూయార్క్‌టైమ్స్' ఆగస్టు 5వ తేదీన ప్రచురించిందంటూ, వీరంతా చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రచారకర్తలుగా పేర్కొన్నాడు.

2023 అక్టోబర్ 3వ తేదీ వేకువఝామున న్యూస్‌క్లిక్ ప్రధాన సంపాదకుడు ప్రబీర్ పురకాయస్థ, హెచ్‌ఆర్ అధికారి అమిత్ చక్రవర్తి, రచయితలు, కాలమిస్టులు, యాంకర్లు, సిబ్బంది, ఇంకా 'న్యూస్‌క్లిక్'తో సంబంధమున్న ఇతరులపై దాడులు జరిగాయి. వారి లాప్‌టాప్‌లు, ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను దాడులలో స్వాధీనం చేసుకున్నారు. న్యూస్‌క్లిక్ కార్యాలయాన్ని, వారి ఇళ్ళను సిబిఐ, ఇడి, ఇఓడబ్ల్యు వంటి సంస్థలు తమ అధీనంలోకి తీసుకొని, వారి ఆరోపణలను ధృఢపరచుకోవాలని చూశాయి. అయితే వారు ఏవిధమైన సాక్ష్యాన్నీ కనుగొనలేక పోయారు. తమపై చేసిన ఆరోపణలన్నింటినీ నిరాకరించిన న్యూస్‌క్లిక్ వాటిని 'అబద్ధాలు'గా పేర్కొంది. ఇంతకు మునుపు కూడా, ప్రభుత్వం న్యూస్‌క్లిక్, ఎన్‌డిటివి, ద వైర్, బిబిసి, ఇతర మాధ్యమ సంస్థలపై ఇలాగే దాడులను సాగించింది.

ప్రజాసంఘాలను, సామాజిక కార్యకర్తలను, రచయితలను, కళాకారులను, మేధావులను ఈ ప్రభుత్వం కుట్రదారులుగా అభివర్ణిస్తూ, ప్రభుత్వాన్ని, ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను, చట్టాలను ప్రజాస్వామిక పద్ధతిలో ప్రశ్నించిన లేదా విమర్శించిన పౌరులెవరిపైన అయినా, క్రూరనిరంకుశ చట్టాలను ప్రయోగిస్తోంది. వారిని అనేక సం॥ల కాలం జైళ్ళలో నిర్బంధిస్తోంది. జర్నలిస్టులు, ప్రచారమాధ్యమ సంస్థల్ని సైతం బలప్రయోగంతో ఈ విభాగం క్రిందనే పరిగణిస్తోంది. అభూత కల్పనలను వ్యాప్తి చేస్తూ, ఉన్మాదాన్ని ప్రేరేపించే వ్యక్తులు, సంస్థలపై ఏలాంటి చర్యా తీసుకోకుండా, ప్రజల పక్షాన నిలిచే జర్నలిస్టులు, మీడియా సంస్థలపై దాడులు సాగిస్తూ పత్రికా స్వాతంత్ర్యాన్ని ప్రభుత్వం గుంజివేసుకుంటోంది. ప్రపంచ పత్రికా స్వాతంత్ర్య సూచీలోని 180 దేశాల క్రమంలో భారతదేశ స్థానం 161వ స్థానానికి పడిపోవటమే, అతి పెద్ద ప్రజాస్వామిక దేశంలో ప్రజాస్వామ్య విలువలు దిగజార్చబడుతున్నాయనే దానికి దృష్టాంతం. అలాగే అధికారంలో వుండి పాలన సాగిస్తోంది, ఫాశిస్టు ప్రభుత్వమనే దానికి కూడా ఇది ఒక తార్కాణం.

ప్రపంచస్థాయిలో అనేకమంది జర్నలిస్టులు, జర్నలిస్టు సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు, రచయితలు, కళాకారులు, మేధావులు, అదేవిధంగా అనేక మంది వ్యక్తులు, సంస్థలు – 'న్యూస్‌క్లిక్'తో సంబంధం కలిగిన వ్యక్తులపై, ఆస్తులపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు.

'న్యూస్‌క్లిక్'తో సంబంధాలున్న వారిపై బనాయించిన కేసులన్నింటినీ ఉపసంహరించుకోవాలని, వారందరినీ వెనువెంటనే విడుదల చేయాలని, ఆ సంస్థకు చెందిన, ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఆస్తులు, వస్తువులన్నీ తిరిగి వారికి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రజల కోసం పనిచేసే, అలాగే ప్రజావ్యతిరేక విధానాలను నిరసించే వ్యక్తులు, సంస్థలపై సంఘాలపై చట్టవిరుద్ధ దాడులు చేయటాన్ని, అరెస్టులు చేయటాన్ని సవాల్ చేయాలి. 'ఉపా', 'నాసా', 'మీసా' వంటి క్రూర నిరంకుశ చట్టాలను రద్దుచేయాలి. వామపక్ష, విప్లవ, ప్రజాస్వామిక శక్తులు ఈ దిశగా కృషి సాగించాలి.

**12-10-23**

**విశ్వం**
**ప్రధాన కార్యదర్శి**
**కేంద్రకమిటి, సిపిఐ(ఎం-ఎల్)**